# కవిత్వం

కోడం పవన్ కుమార్

కవిత్వం
నా వ్యక్తిత్వం
మెదడ్ని గిరిగీసుకున్న వృత్తం
చూపును కనుపాపలపై నిలుపుకున్న ఛత్రం
ఉచ్ఛ్వాస నిశ్వాసలను పీల్చి వదిలే నాసికారుత్వం
ఆకలిని ఆరగించి తేన్పుతీసే నోటితత్వం

కవిత్వం
నా హృదయతత్వం
గాలిలో గిరికీలు కొడుతూ శ్వాసిస్తుంది
వెలుతురులో పల్టీలు కొడుతూ అనుభూతినిస్తుంది
చీకటిలో చిక్కుముడులు విప్పుతూ అనుభవాన్నిస్తుంది

కవిత్వం
నా చూపుచిత్రం
మిణుగురులా చీకటిని చీల్చుతుంది
మెరుపులా ఆకాశాన్ని వణికిస్తుంది
ఉరుములా మేఘాన్ని గర్జిస్తుంది
గర్జిస్తున్న మేఘంలోంచి చినుకుల్ని రాలుస్తుంది

అక్షరాలు పదాల వ్యక్తిత్వం
పదాలు వాక్యాల హృదయత్వం
వాక్యాలే కవితాచిత్రం

★★★

# గిరికర్ణికాంబరీయము

డా.మూర్తి జొన్నలగెడ్డ

కనుల నిండుగ నుండె పుడమి
కడు హరితమై వన భరితమై
ఆ గగనంపు రారాజ
మధురూహ ఫలితంబు
మేఘు కన్నియల రాయబార
మతి ప్రేమ సారమది

అరులు చూపిన గిరుల కూడగ
చిరు జల్లులై యా జడి సింధువై
పొంగి పొరలేను నేల 'తడి'మేను
తడవ తడవకూ తాప తప్తుడై
ఆ దేవి నటులనే తాకేటి సంద్రుడు
సోమ ధారల కూడి ఎగసి వగసేను
సోమ ధారల కూడి ఎగసి వగసేను

అదియు గాంచిన జగచ్ఛక్షువు
చండ కరుడై కడలి ఆవిని
మిన్ను కడకే మరలి వైచెను
ఆశ వీడని ప్రేమ వాడని ఆ
మింటి పెనిమిటి మిగుల పొంగెను
పచ్చంగ పొంగారు భామ కయ్యది
సమ్మతంబని తలచుచుండెను
సమ్మతంబని తలచుచూ మరి
శంబరమ్ముల పంపుచుండెను

ఓ ధరణీధర అవసథులార!
తెలివి కరవై నిండు వనముల
నిచ్చ కనువుగ నరకి ప్రోగిడి
పచ్చ కొండల నెర్ర బండల
వోలె అడచి అటుల విడిచి
వెడలి పోవుట అసలు తగదు

భూమి కన్నియ అనీహంబున
కెంపు వన్నియ దాల్చినటుల
ఆ రేడు తలచిన ఆ వాన నిలచిన
కల్ల లగునా తల్లి కలలిక

ప్రకృతి యందలి పండు చుండెడి
ప్రేమ గాథకు పెద్ద తోడుగ
నిలిచి యుండగ అదియు పండగ
వెల్లి విరిసెడి అమృత ధారల
ఆనంద తాండవ మాడు చుండగ
మనుజ లైనా అమరు లౌరట
మరిక భువియే స్వర్గ మౌనట!

★★★

# జీవన వలయం
## ఐ.ఎస్.ప్రసాద్

కం || ఎండల వేడికి సంద్రము
మెండుగ ఆవిరుల జిమ్మి మేషము లవగన్
దండిగ గురిసిన వానలు
కొండలబడి నదుల బారు కూడను కడలిన్

కం || కనుచూపుమేర సంద్రము
కనుగొని నది హడలి పోవు కడలిని గలువన్
వెనుదిరిగి బారనేరదు
తను సంద్రము లోన గలసి తనె సంద్రంబౌ

కం || ఇల బుట్టిన బ్రతి ప్రాణియు
ఇలవీడును మరుల బుట్టు ఇది సహజము ఈ
ఇల బుట్టిన జనులకు ఈ
ఇల వీడెడు భయము గూడ ఈ నది బోలున్.

★★★

# మన దారం
## డా.సి. భవానీదేవి

నిజానికి ఎవ్వరూ
పుట్టిందీ లేదు .... గిట్టిందీ లేదు
పుట్టటం అంటే
మట్టిలోంచి మట్టిగా ఎదగటమా?
గిట్టటమంటే
మళ్ళీ మట్టిలో కలిసిపోవటమా?
కానే కాదు
చరిత్రగా ఎదగటం ... మిగలటం!
ఆకాశంలో నక్షత్రాల్ని
పద్యాల్లో తుఫానులుగా మార్చి
ప్రతిధ్వనుల అనుభూతుల్ని
చినుకులుగా విన్పిస్తున్నాను!
ముళ్ళమోడుల మధ్య వేణుగానం వింటూ
ప్రాణశక్తిని ఆవాహన చేసుకుని
పరవళ్ళు తొక్కే నదినయ్యాను!
జీవితమున్నంత కాలమే
మన స్పందనలు ... సమరాలు
అనంతరం ... అనంతత్వంలోకి
అదృశ్యమయ్యే దృశ్యమే!
దారానికి కన్పించేవి రెండుకొసలే
రెంటి మధ్య ఉన్న దారం ... మనం!!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

సూర్యచంద్రులను కదలించునది ప్రేమ
చుక్కల నభోతలమున గూర్చునది ప్రేమ
గాలియలలందు సెలయేటి గమనమందు
ప్రేమ కననౌను వినవౌను విశ్వమెల్ల

ఈ మహత్తరశక్తి తానెల్ల జనుల
ఎడద లోతులలో నివసించియుండు
జీవితమ్మెల్ల మనతోడ చెలిమి చేసి
ప్రక్కనే యుండి మానసైశ్వర్యమొసగు

ఎట్టులో యెప్పుడో మన యెదను చేరి
పదిలమైనట్టి పీఠమ్ము పరచుకొనును
ఎవ్వరో  కదిలింప యత్నింతురైన
అచలమైనది ప్రేమ సింహాసనమ్ము

ఎండుటాకులలోనైన, బండ రాళ్ళ
నైన, కదలు ప్రాణులనైన, యలసిపోయి
కన్నుమూసిన వారల గతమునైన
ప్రేమ గాథల నెన్నియో వినగనౌను

అంతయును నిండు ప్రేమ మాహాత్మ్యమేమి
మనసులను నిండి నిత్య నైర్మల్యమొసగు
ఎచట చూచిన గాని తానచటనుండు
ప్రకృతి నిర్మాత తానన పరిఢవిల్లు

COMMENTS